

ఉష్ణోగ్రత (అంచనా)

9-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	25
బాపట్ల	37	28
రెంటచింతల	39	26
చీరాల	37	28



ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఒంగోలు జాతి ఎద్దులు.. ఆంధ్రుల పౌరుషానికి ప్రతీక

◆ బల ప్రదర్శన పోటీల్లో హోంమంత్రి అనిత

పొన్నూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రులు పౌరుషానికి ప్రతీకగా ఒంగోలు జాతి ఎద్దులు నిలుస్తాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజములు బల ప్రదర్శన పోటీలను వడ్లమూడిలో ఎనిమిదో రోజు గురువారం ప్రారంభించారు. చివరి రోజు సీనియర్స్ విభాగంలో ఒంగోలు జాతి ఎద్దులు 2200 కిలోల బండను లాగి పోటీలో తలపడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎద్దులు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడించాయన్నారు. కష్టతరమైన ఎద్దుల పోషణపై రైతులు మక్కువ పెంచుకుంటున్నారని కొనియాడారు. ఎద్దుల పెంపకానికి బల ప్రదర్శన పోటీలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. దేశానికి రైతు వెన్నుముక అయితే, ఆ రైతుకు ఒంగోలు జాతి ఎద్దులు అండగా నిలుస్తున్నాయన్నారు. సంగం డెయిరీ అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వంలో డేగకన్ను పడిందని, ఆ కారణంగానే అక్రమ కేసులతో నరేంద్రకుమార్‌ను అరెస్టు చేశారన్నారు. మరో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజెప్పేలా ఎద్దుల పోటీలు జరుగుతున్నాయన్నారు. సాంప్రదాయ సాగు పద్ధతులు కనుమరుగై యాంత్రీకరణతో ఒంగోలు జాతి ఎద్దులకు ఆదరణ తగ్గుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ దాసరి రాజామాష్టారు, అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, నాదెండ్ల బ్రహ్మంచౌదరి పాల్గొన్నారు.

రేపటి నుంచి మిర్చియార్డు బంద్

◆ వచ్చే నెల 9 వరకు క్రయవిక్రయాలు నిలిపివేత

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో క్రయవిక్రయాలు శుక్రవారం సాయంత్రంతో ముగుస్తాయి. వేసవి సెలవుల కారణంగా మార్కెటింగ్ శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. శనివారం నుంచి యార్డులో ఎటువంటి కార్యకలాపాలు జరగవు. తిరిగి జూన్ 9న మిర్చియార్డులో లావాదేవీలు పునః ప్రారంభ మౌతాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వరకే యా ర్డులో మిరపకాయలను విక్రయించుకోవడానికి తెచ్చుకో వాలని, ఈ విషయంలో రైతులు సహకరించాలని యార్డు వర్గాలు విజ్ఞప్తి చేశాయి. కాగా ఇప్పటికే యార్డుకు మిర్చి టిక్కీల సంఖ్య రాక తగ్గిపోయింది. రోజుకు లక్ష లోపే టిక్కీలు వస్తున్నాయి. వాటిల్లోనూ కాయ సైజు చాలా తక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- లక్ష్యం చేరుకోవడంలో అధికారుల విఫలం
- అసంఘటిత కార్మికులకు కార్డుల జారీ అంతంతే
- బహుళ ప్రయోజనాలున్నా అవగాహనపై ఉదాసీనం
- నమోదుకు దూరంగా ఇంకా ఏడు లక్షల మంది శ్రామికులు

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు.. గాయపడితే లక్ష వరకు ఆర్థిక సాయం. అసంఘటిత రంగ కార్మికులకు పైసా ఖర్చు లేకుండా బీమా అందించేలా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డును ప్రవేశపెట్టింది. కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రాయోజిత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులుగా తేల్చడానికి కూడా ఈ-శ్రమ్ ప్రామాణికంగా ఉపయోగపడనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కార్మికులకు అవగాహన కల్పించి ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకునేలా వారిని చైతన్యపరచాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా ఉంటున్నది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా లక్ష్యాలకు ఆమడ దూరంలో కార్మికశాఖ ఉంది. మూడు జిల్లాల్లో ఇంకా 7 లక్షల మంది కార్మికులు ఈ-శ్రమ్‌కు దూరంగా ఉంటున్నారంటే అధికారుల్లో నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



ఈ-శ్రమ్... నిర్లక్ష్యం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రాయోజిత పథకం ఈ-శ్రమ్. ఇందులో నమోదు చేసుకున్న కార్మికుడికి ఈ-శ్రమ కార్డును ప్రభుత్వం అందించనుంది. కార్మికులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని గత ప్రభు త్వం పూర్తిగా అటకెక్కించగా.. ప్రస్తుత ప్రభు త్వంలోనూ అదే ధోరణి కనిపిస్తోంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రధానంగా ఈ పథకంపై క్షేత్రస్థాయిలో కార్మికులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారు. అసంఘటిత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడే ఈ-శ్రమ్ కార్డు విషయంలో నెలవారీగా సమీక్షలు జరిపి పురోగతి తెలుసుకోవడం కూడా లేదు. మొక్కుబడిగా ఓ ప్రకటన ఇచ్చి వదిలేయడం తప్పితే లక్ష్యాలను చేరుకుని పథకం ఫలాలను కార్మికులకు చేరుస్తామన్న చిత్తశుద్ధి యంత్రాంగంలో కొరవడింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోని కార్మికుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు ఏడు లక్షల మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే రెండున్నర లక్షలమంది ఈ పథకానికి దూరంగానే ఉన్నారు. ఈ-శ్రమ్ నమోదుకు సంబంధించి సచి వాలయాల వారీగా కార్మికశాఖ సమీక్ష



చేయ లేదు. నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉన్నా నమోదులో గణనీయమైన ఫలితాలు సాధిస్తు న్నామనే ఆర్భాటపు ప్రకటనలకే కార్మికశాఖ పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. పైగా కార్మికుల డేటా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉన్నందున నమోదులో జాప్యం జరుగుతుం దనేది యంత్రాంగం వాదన. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ పథకానికి అర్హులు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని చిరువ్యా పారులు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపా రులు, ఆశా వర్కర్లు, మత్స్యకారులు, ఉపాధి హామీ శ్రామికులు, ఆటో డ్రైవర్లు, రిక్షా, రాడ్ బెండింగ్, ప్లబింగ్, టైల్స్, కరెంటు, వెల్డింగ్, ఇటుక తదితర రంగాలలో పనిచేసే వారందరూ కూడా అర్హులే. కానీ వీరిలో చాలామందికి ఈ-శ్రమ్‌లాంటి ఓ పథకం ఉందని కూడా తెలియకపోవడం విశేషం. పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, సీఎస్సీ కేంద్రాలు, కార్మికశాఖ కార్యాలయంలో అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ-శ్రమ్ కార్డు నమోదుకు రూ.13 చొప్పున ఇస్తామని ప్రకటించి కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు రూ.50 లక్షలు బకాయి పెట్టింది. దీంతో ఆయా సెంటర్ల నిర్వాహకులు ఈ-శ్రమ్ కార్డు నమోదును నిరుత్సాహ పరుస్తున్నట్లు సమాచారం.

ఫీజు.. పత్రాలని పీడింపు

ఈ-శ్రమ్‌పై అవగాహనతో కొందరు నమోదుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నా వారిని ఫీజు, ధ్రువీకరణపత్రాలంటూ పీడిస్తున్నట్లు సమాచారం. నమోదుకు ఎలాంటి ఫీజు అవసరం లేదు. అయితే కొన్ని చోట్ల రిజిష్టర్ పేరిట వసూళ్లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు ఆధార్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నంబరు, నామినీ ఆధార్ వివరాలు చాలు. కానీ ఏవేవో పత్రాలు కావాలని తమను తిప్పుకుంటున్నారని కార్మికులు వాపోతున్నారు.


- 47.848 కిలోమీటర్ల పొడవునా ప్రతిపాదిత మార్గం
- ఎన్‌హెచ్-216, ఎస్‌హెచ్-261, 269, 334, 279, 350 మీదగా నిర్మాణం
- ఈ రూట్ అయితే బహుళ ప్రయోజనాలున్నాయని కన్సెల్టెన్సీ అభిప్రాయం
- అమరావతి ఓఆర్ఆర్-నిజాంపట్నం పోర్టు హైవేకు కేంద్రం ఆమోదం

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు.. నాలుగో ఎలైన్‌మెంట్

ఖర్చు తక్కువ.. పర్యాటకం

గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా నాలుగో ఎలైన్‌మెంట్‌కు అటు కన్సల్టెన్సీ ఇటు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో ఎన్‌హెచ్-216, రాష్ట్ర హైవేలు-261, 269, 334, 279, 350 మీదగా రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు తగ్గుతుందని అంచనా వేశారు. ఈ హైవేతో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన సూర్యలంక, చీరాల బీచ్‌లు, క్షీర భావన్నారాయణ స్వామి, సుందరవల్లి, జిల్లెళ్లమూడి అమ్మవారు, సహస్రలింగేశ్వర, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు పర్యాటకం పెరుగుతుందని డీపీఆర్ రూపొందించిన సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది.

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్మించబోయే అమరావతి అవుటర్ రింగురోడ్డులో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు నుంచి బాపట్ల జిల్లా నిజాంపట్నం పోర్టు వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సుముఖత వ్యక్తపరిచింది. ఇందుకోసం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ నివేదించేందుకు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థ తొలుత మూడు ఎలైన్‌మెంట్లను పరిశీలించి నివేదిక అందజేసింది. కొత్తగా నాల్గో ఎలైన్‌మెంట్‌ని కూడా సిద్ధం చేసి ప్రజంటేషన్ ఇచ్చింది. సామాజిక ప్రభావం తక్కువగా, ఖర్చు తక్కువయ్యే ఈ నాలుగో ఎలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే పర్యాటకం పెరుగుతుందని కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌లో పొందుపరిచింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు రూ.1391.46 కోట్లయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇందులో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.240.98 కోట్లు, నిర్మాణాలకు రూ.890.93 కోట్లు అవుతాయని డీపీఆర్‌లో పొందుపరిచారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు అత్యుత్తమైన కనెక్టివిటి పెరుగుతుంది. సూర్యలంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్సు బేస్‌స్టేషన్, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు కనెక్టివిటీ పెరిగి స్థానికంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. అంతేకాకుండా రాష్ట్ర హైవేలు ఎస్‌హెచ్-240, 261పై ట్రాఫిక్ తగ్గి సరుకు రవాణా వేగవంతంగా జరుగుతుంది. 1975లో 27.87 ఎకరాల అటవీ మళ్లింపు జరగ్గా ఇందులో 17.87 ఎకరాలను ఫిషింగ్ హార్బర్ అప్రోచ్‌కు వినియోగిస్తున్నారు. మిగతా భూమిలో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఏపీఎంబీ సీఈవో ఎన్‌వోసీ కూడా జారీ చేశారు. పర్యావరణ హితంగా నిర్మించబోయే ఈ రోడ్డు మార్గంలో మొత్తం 24 చోట్ల కెనాల్/రివర్ క్రాసింగ్స్ చేయాలి. అలానే విజయవాడ-గూడూరు సెక్షన్‌లో చుండూరు రైల్వేస్టేషన్‌కు సమీపంలో 12+245 వద్ద రైల్వే క్రాసింగ్ కూడా చేయాల్సి ఉంటుంది. రేపల్లె - బాపట్ల డీసీ/ఎస్‌సీ లైన్(పీ)లో 28+550 లొకేషన్ వద్ద 132 కేవీ పవర్ లైన్‌ని కూడా క్రాస్ చేయాల్సి ఉన్నది. ఈ డీపీఆర్‌కి కేంద్రం కనక ఆమోదం తెలిపితే ఆరు నెలల్లో భూసేకరణ, ఏడాది వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును త్వరితగతిన గ్రౌండింగ్ చేసేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ టీ కృష్ణప్రసాదు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



మ్యాప్‌లో నీలం రంగులో ఉన్న ప్రాధాన్య ప్రతిపాదిత ఎలైన్‌మెంట్

రాబోయే ప్రాజెక్టులు

ఈ ఎలైన్‌మెంట్ వెంట కొత్తగా పలు ప్రాజెక్టులు రాబోతున్నాయి. నల్లపాడు - కృష్ణాకెనాల్ రైల్ ఓవర్ రైల్, కృష్ణాకెనాల్ - నల్లపాడు 3, 4 రైలు మార్గాలు, ఈస్టు కోస్టు కారిడార్ భవిష్యత్ డీఎఫ్‌సీ, కృష్ణానది వంతెన మీదగా గుడివాడ - తెనాలి(విజయవాడను బైపాసు చేస్తూ) రోడ్డు మార్గం వంటి ప్రాజెక్టులు ఇప్పటికే మంజూరై ఉన్నాయి.

మండిన ఎండ.. భారీ వర్షం

- ఈదురు గాలులతో విరిగిన చెట్ల కొమ్మలు
- తడిచిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు

తెనాలి అర్బన్, కొల్లిపర, దుగ్గిరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఎండ మండింది.. ఆపై ఒక్కసారిగా వాతావరణంలో విపరీత మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. గత కొద్ది రోజులుగా 37 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో తల్లడిల్లుతున్న జనం గురువారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లగా మారడంతో ఉపశమనం పొందారు. గురువారం మధ్యాహ్నం జిల్లా పరిధిలోని తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తెనాలిలో రెండు గంటలకుపైగా కురిసిన వర్షంతో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి. కొల్లిపర ప్రాంతంలో మబ్బులు కమ్ముకు వచ్చి కుంభవృష్టిగా వర్షం పడింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు తడిచిపోయాయి. పట్టాలు కప్పినా భారీ వర్షంతో దిగుబడులు తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో ఇటుక పరిశ్రమ రైతులకు అపారమైన నష్టం వాటిల్లింది. దావులూరు అడ్డరోడ్డు సమీపంలో ప్రధాన రహదారిపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దుగ్గిరాల మండలంలో కురిసిన అకాల వర్షంతో కల్లాల్లోని మొక్కజొన్న పంట పూర్తిగా తడిసిపోయింది.



తెనాలి : గాంధీనగర్‌లో నిలిచిన వర్షపు నీరు



కొల్లిపరలో నీటిలో నానుతున్న ఇటుక రాయి

ఆధారాల సేకరణతోనే నిందితులకు శిక్షలు

ఫోరెన్సిక్‌పై చర్చా వేదికలో ఎస్పీ సతీష్‌కుమార్



ఫోరెన్సిక్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతోన్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో ఆధారాల సేకరణలో పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చేయవచ్చని ఎస్పీ సతీష్‌కు మార్ తెలిపారు. ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణపై గురువారం పోలీస్ కార్యాలయంలో జరిగిన చర్చా వేదికలో ఎస్పీ ప్రసంగించారు. దర్యాప్తు ప్రక్రియకు ఉపకరించే మెలకువలను ఫోరెన్సిక్ నిపుణులు వివ రించారు. ఏదైనా కేసుకు సంబంధించి ఘటన జరిగిన ప్రదేశం నుంచి న్యాయస్థానంలో కేసు విచారణకు వెళ్లే వరకు పొందుపరిచే ప్రతి ఆధారాన్ని భౌతికంగా, సాంకే తికపరంగా ఏ విధంగా సేకరించాలనే విషయాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, ఫోరె న్సి క్ సైంటిఫిక్ అధికారులు రీనాసూసన్, సురేంద్రబాబు, ఫోరెన్సి క్ అసిస్టెంట్ డైరెక్టర్లు వంశీకృష్ణ, సత్యరాజు, జీజీహెచ్ ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ బి.నాగేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డుకు ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 13 నుంచి జూన్ 24వ తేదీ వరకు(ప్రతీ మంగళవారం) (07421) చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఉదయం 6.55కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా 11.55కి గుంటూరు, రాత్రి 10.45కి శ్రీకాకుళం రోడ్డు చేరుకుటుంది. (07422) శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం బయలుదేరి గుంటూరు మీదగా చర్లపల్లి చేరుతుంది.

సైనిక్ స్కూల్‌కు అనుమతులు మంజూరు

శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ తులసీ విష్ణుప్రసాద్



కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్ గురువారం తెలిపారు. చిలుమూరు విద్యా సంస్థలో విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 1949లో కొలసాని వెంకటసుబ్బయ్య శ్రీరామా గురుకుల పాఠశాలను స్థాపించారని తెలిపారు. 2021లో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 100 ప్రైవేట్ సైనిక్ స్కూళ్లను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయాలని భావించిందన్నారు. దానిలో భాగంగా సైనిక్ స్కూల్ ఏర్పాటుకు దరఖాస్తు చేయగా.. వారం క్రితం కేంద్ర ప్రభుత్వం, డిఫెన్స్ శాఖల నుంచి అనుమతులు మంజూరు కావడంతో.. మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ పూర్తి చేయడం జరిగిందన్నాని వివరించారు. దేశ వ్యాప్తంగా కేవలం 33 సైనిక్ పాఠశాలలు ఉండగా.. నూతనంగా ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు మాత్రమే ఎంపికయ్యాయని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో సైనిక్ స్కూల్ అడ్మిషన్స్‌కు అనుమతులు పొందినట్లు చెప్పారు. ఇక నుంచి శ్రీరామా సైనిక్ స్కూల్‌గా నామకరణం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొలసాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమాలను అరికట్టారా?

మిర్చియార్డు అధికారులను ప్రశ్నించిన మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడలోని తన కార్యాలయానికి పిలిపించుకుని ప్రశ్నల వర్షం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): యార్డులో అవినీతి, అక్రమాలను ఎంతవరకు అరికట్టారు.. లైసెన్సింగ్ సిస్టమ్‌లో ఎలాంటి మార్పులు చేశారు.. జీరోలు, కటింగ్, బిల్ టూ బిల్, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేయడం వంటివి అరికట్టారా.. అని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మిర్చియార్డు అధికారులకు పలు ప్రశ్నలను సంధించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయానికి మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులను పిలిచి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికతో పాటు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఆంజనేయ సింగ్, ఇతర సెక్రెటరీలు హాజరయ్యారు కాగా ఆరు నెలల క్రితం తాను జారీ చేసిన ఆదేశాలు ఏమేరకు అమలు చేశారని ఆరా తీశారు. యార్డులో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ విభాగం గత ఏడాది దర్యాప్తు చేసి రూ. 436 కోట్ల మేరకు అవినీతి జరిగినట్లుగా పేర్కొంటూ అందుకు కొంతమంది అధికారులను బాధ్యులను చేసి రిపోర్టు ఇచ్చింది. దాంతో గత నవంబరులో మంత్రి అచ్చెన్నాయుడు గుంటూరు మార్కెటింగ్ కమిషనరేట్‌కు వచ్చి ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. జీరో బిజినెస్, కటింగ్ బిజినెస్ వల్ల యార్డు ఆదాయం పోతున్నదని ఈ సమావేశంలో కొంతమంది రైతులు, వ్యాపారులు మంత్రి సమక్షంలో చెప్పారు. బిల్ టూ బిల్‌తో వ్యాపారులు 2 శాతం కంటే అధికంగా కమీషన్‌ని వసూలు చేస్తున్నారని కొందరు రైతులు మంత్రికి ఫిర్యాదు చేశారు. యార్డులో లైసెన్సింగ్ వ్యవస్థ పకడ్బందీగా లేదని చెప్పారు. ఒక్కో కుటుంబంలో నాలుగైదు లైసెన్సులు పొంది ఉన్నారని, కొందరైతే లైసెన్సులు లీజుకు తీసుకొని అనధికారికంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి లైసెన్సింగ్ వ్యవస్థ మొత్తాన్ని అధ్యయనం చేసి తనకు నివేదిక అందజేయాలని అప్పట్లో ఆదేశించారు. అది ఎంతమేరకు వచ్చిందని గురువారం జరిగిన సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. ఒక కుటుంబానికి ఒక లైసెన్సుకు మించి ఉండరాదని, త్రీమెన్ కమిటీ రిపోర్టు లేకుండా లైసెన్సులు మంజూరు చేయడం, రెన్యువల్స్ వంటివి చేయరాదని స్పష్టం చేశారు. మిర్చి సీజన్ శుక్రవారంతో ముగియనున్నందున పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్డ్‌స్టోరేజ్‌లు, మిర్చి గోడౌన్లు వంటి ప్రదేశాల్లో క్రయవిక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెట్టాలన్నారు. చెక్‌పోస్టులను పటిష్టం చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కాగా మంత్రి అడిగిన ప్రశ్నలు అధికారులు స్పష్టంగా సమాధానాలు చెప్పలేకపోయారని తెలిసింది.

ముస్లింల అభ్యున్నతికి సహకారం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా ముస్లిం సోదరుల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం దాచేపల్లిలోని విజయ భాస్కర కల్యాణ మండపంలో హజ్ యాత్రకు వెళ్తున్న ముగ్గురు ముస్లిం సోదరులకు లక్ష రూపాయల చొప్పున ఆయన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేనితో పాటు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జానబ్ షేక్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జానబ్ షేక్ హాస్సేన్ బాషా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ సూపర్ - 6లో భాగంగా హజ్ యాత్రికులకు లక్ష రూపాయల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 48 మందిని హజ్ యాత్రకు పంపించామని, రూ.50 లక్షలకు పైగా అందజేశామని వివరించారు. ముస్లిం సోదరుడి ఇల్లు తాకట్టులో ఉంటే తాను రూ.3 లక్షలు చెల్లించి విడిపించానని గుర్తుచేశారు. అల్లా దయ వల్ల అందరూ బాగుండాలని ఆయన వేడుకొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లడం పవిత్ర కార్యక్రమం అన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ షేక్ మౌలానా ముస్తక్ అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం సోదరుల హజ్ యాత్రకు సహకరించడం అనేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గొప్పతనమన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హాస్సేన్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల పక్షపాతి కలిగిన ఎమ్మెల్యే అంటే మొట్టమొదట గుర్తు వచ్చేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరేనని తెలిపారు. పిడుగురాళ్ల మునిసిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా హఫీజ్ హాస్సేన్, సయ్యద్ అమీర్ ఆలీ, షేక్ బాబావలి పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

పొన్నెకల్లు (తాడికొండ) మే 8(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘా తంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి పొన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన పేర్ల అన్నపూర్ణ(70) కొంతకాలంగా వెన్ను ముకనొప్పి కారణంతో.. పూర్తిగా మంచానికే పరిమితమైంది. బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయి, తిరిగి వచ్చిన క్రమంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయింది. మంటలు వ్యాపించి అన్న పూర్ణ పూర్తిగా కాలిపోయింది. పై అంతస్తులో ఉన్న కూమార్తె, అమె భర్త గమని ంచి కిందకు వచ్చే సరికి మరణించింది. గురువారం మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేఎల్‌యూలో

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థికి ఫీజు రాయితీ ధ్రువీకరణ పత్రం అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 8, (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం ఎస్సీ ఎస్టీ ఓబీసీ కోటా కింద విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి ఓపెన్ కేటగిరి మెరిట్ విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 11న ఆదివారం వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. కేఎల్‌ఈ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన వారితో పాటు.. ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. జేఈఈలో అత్యుత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులకు కూడా మెరిట్ స్కాలర్‌షిప్స్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. కేఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలో 3వ ర్యాంకు పొందిన ఆళ్ల వెంకట సాయి, అఖిల్‌కు, క్రీడల విభాగంలో జీగ్నాష్‌కు సీఎస్ఈ కోర్సులో 50 శాతం ఫీజు రాయితీతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు అధికారికంగా ప్రవేశాలను అందజేశారు.

ఆయుష్ వైద్యశాల

స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రత్తిపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడింపాలెం ఆయుష్ వైద్యశాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన బృందం గురువారం పరిశీలించింది. గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిలో సర్వే నెంబరు 149/4ఏ లో 14.96 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యశాలకు కేటాయించింది. డిల్లీ నుండి వచ్చిన సీసీఆర్ వైఎస్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రావు, అసిస్టెంట్ డైరెక్టర్ కన్సల్టెంట్ ఎ. మోహన్‌రావు, భారత్ భూషన్, మినిస్ట్రి ఆఫ్ ఆయుష్ కన్సల్టెంట్ ఎంఎ ఖాన్ బృందం ఈ భూమిని పరిశీలించింది. ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ పూర్తి వివరాలు బృందానికి అందించారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సిన్హా పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	142, 151, 162
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

96,256 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 91,812 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,364 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13400	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12500
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12600	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

అధునాతన టెక్నాలజీతో కేసును ఛేదించిన పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇటుకరాయితో తలపై మోదీ ఓ వ్యక్తిని హతమార్చినట్లు నేరం రుజువడంతో నిందితుడు పట్టణంలోని శివసంజీవ కాలనీకి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కరివేదుల సంపత్‌రెడ్డి(45) 2023 మే 9న నరసరావుపేటకు వచ్చి స్థానిక గాంధీపార్క్ సమీపంలో తీవ్రగాయాలతో మృతి చెందాడు. అతడి తండ్రి కరివేదుల నరసింహారెడ్డి ఫిర్యాదు మేకరకు మొదటి పట్టణ పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందిగా గుర్తించారు. నిద్రలో ఉన్న సంపత్‌రెడ్డిను ఇటుకతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదును అంకమ్మరావు తీసుకువెళ్లినట్లు సీసీ ఫుటేజి ఆధారంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ మేరకు అంకమ్మరావును అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసును దర్యాప్తు చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

గుంటూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్స్ శిక్షణను ఉచితంగా ఇస్తామని విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర విభిన్న ప్రతిభావంతులైన, అభ్యర్థులు విజయవాడలో నిర్వహించే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం 40% శాతం వికలత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని, టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 11 వరకు ఎంపీఎఫ్‌సి.ఏపీసిఎఫ్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి



చెట్టుకింద మృతి చెందిన మేకలు

కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అనంతవరంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. కార్మూరి వెంకటరామయ్యకు చెందిన మూగజీవాలు చింత చెట్టు కిందకు చేరాయి. అదే సమయంలో చింత చెట్టుపై పిడుగు పడటంతో 23 మేకలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు వరకు ఉంటుందని యజమాని తెలిపాడు. విషయాన్ని పశు వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు తెలియజేయడంతో.. వైద్యులు మృతి చెందిన మూగజీవాలను పరిశీలించారు. మేకల మృతిపై పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

●ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి తెలిపారు. కళాశాల 80వ వార్షికోత్సవం గురువారం కళాశాలలోని డాక్టర్ బీవీ.నాథ్ ఆడిటోరియంలో జరిగింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను పెంపొందించుకోవాలని చెప్పారు. నూతన అవకాశాలు గురించి విద్యార్థులకు డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు వివరించారు. వ్యవసాయ విద్య ప్రాముఖ్యత గురించి డీన్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సాహిత్య, క్రీడ, సాంస్కృతిక పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేశాయి. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.ప్రసూనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.



బేబీ కిట్ (పాత చిత్రం)

జీజీహెచ్‌లో బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ

● ఇకపై బాలింతలకు 11 వస్తువులు అందజేత

గుంటూరు మెడికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వా స్పత్రుల్లో 2014-19 మధ్య అమలు చేసిన.. బేబీ కిట్ల పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరు ద్ధరించింది. పసికందుల ఆరోగ్య సంరక్షణ కోసం రూ.1,410 లతో.. 11 రకాల వస్తువుల ను బాలింతలకు అంద జేస్తారు. అప్పట్లో ఈ పథకానికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద కొంత మేరకు కేంద్ర ప్రభుత్వం సాయం అందించేది. ఈ సాయాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో.. వైసీపీ ప్రభుత్వం నిధుల సాకుతో పథకాన్ని రద్దు చేసింది. దరిమిలా ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా, 15వ ఆర్థిక కమిషన్ నిధుల కింద ఈ పథకంలో కిట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం లభించే అవకాశం లేదు. ప్రజాదరణ పొందిన ఈ పథకాన్ని పునఃప్రారంభించాలని, ఇందుకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వమే అందజేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన ప్రతిపాదనకు ముఖ్య మంత్రి చంద్రబాబు నా యుడు ఆమోదం తెలిపారు. ఫలితంగా త్వరలో సర్కారు ఆసుపత్రుల్లో తిరిగి బేబీ కిట్ల పథకం అమలు కానుంది. బేబీ కిట్‌లో.. దోమ తెరతో కూడిన బేబీ బెడ్, వాటర్ ప్రూఫ్ కాట్ షీట్, బేబీ డ్రెస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు, పోస్ బాక్స్, రాటిల్‌రాయ్ వంటివి ఉంటాయి.

ముస్సోరి అకాడమిలో శిక్షణకు కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రీ నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణకు హాజరు కానున్నారు. ఐఏఎస్ అధికారులకు మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగాం ఫేజ్-5 ఈ నెల 7వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతుంది. అయితే జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజ సెలవులో ఉన్న కారణంగా తన ముసోరి పర్యటనను రెండు రోజులు కలెక్టర్ వాయిదా వేసుకొన్నారు. శుక్రవారం ఆమె అక్కడ ట్రైనింగ్‌కు హాజరౌతారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. మూడు వారాల పాటు ఈ ట్రైనింగ్ జరగనుంది. అప్పటివరకు ఇన్‌చార్జ్‌గా కలెక్టర్‌గా జేసీ బాధ్యతలు నిర్వహిస్తారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

● 229 మందికి రూ. 14.30 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, గుంటూరు టౌన్-1 ఈఈ శ్రీనివాసబాబు నేతృత్వంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు (డీపీఈ) ఆధ్వర్యంలో నగరంలోని డి 1 సెక్షన్ పరిధిలో గురువారం విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో 55 మంది అధికారులు, 185 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి 4019 సర్వీసులు తనిఖీలు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో, అదనపు లోడ్‌తో వినియోగించటంపై మొత్తం 229 మందికి 14.30 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఈఈలు కె రవికుమార్, డీఈఈ ఎస్ మల్లికార్జునప్రసాద్, ముస్తాక్ అహ్మద్, ఏఈలు కోటేశ్వరరావు, ఎమ్ సతీష్‌కుమార్, యు శివశంకర్, ఆపరేషన్ ఏఈ కె అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసులు

విద్యతోనే సమాజంలో గౌరవం

గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమినర్ డాక్టర్ కె శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే సమాజంలో గౌరవం పెరుగుతుందని, చిన్నతనం నుంచి చదువులో రాణిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసులు తెలిపారు. గురువారం శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో పదవ తరగతిలో మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. తాలూకా కాంపౌండ్‌లో గల రాష్ట్ర పెన్షనర్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 2025 సంవత్సరానికి గాను 10వ తరగతిలో 500 మార్కులు పైన సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థినీ విద్యార్థులకు ఈ పురస్కారాలను గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రతిభను కొనసాగిస్తూ భవిష్యత్తులో సైంటిస్టులు, కలెక్టర్లు, డాక్టరులుగా మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థి మీద ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు యాదవ్, ట్రస్ట్ చైర్‌పర్సన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, శ్రీకృష్ణ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న వివాహిత ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరాలులో చోటుచేసుకుంది. ఈ ఘటనలో షేక్ ఖైరున్నీసా (28) ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. కొద్ది సంవత్సరాల క్రితం ఖైరున్నీసా, పవన్ కుమార్‌లు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నారు. పవన్ కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో పవన్ కుమార్ తీవ్రంగా నష్టపోయాడు. దీంతో అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై భార్య, పిల్లలను సరిగా పట్టించుకోవడం లేదు. ఇలా అయితే తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని వారు ఎలా బతుకుతారంటూ కొంతకాలంగా ఖైరున్నీసా మనస్థాపంతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో భార్య, భర్తలు, పిల్లలు నిద్రపోయారు. గురువారం 9 గంటల సమయానికి నిద్ర లేచి చూడగా ఖైరున్నీసా ఇంటిలో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి అక్క అమీరున్నిసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10, 11 తేదీల్లో వన్డే, టీ 20 జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పిచుకల గుంట మైదానంలో సీనియర్ పురుషుల విభాగంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన్డే, టీ 20 జట్ల ఎంపికలు జరుగుతాయని త్రీ కమిటీ సభ్యుడు మహతి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న అండర్-23 విభాగంలో, 11న సీనియర్ పురుషుల విభాగంలో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లోకి వరదలా మురుగు

● అవుట్ ఫాల్ డ్రెయిన్ల నిర్మాణాలతో కాంట్రాక్టర్ నిర్వాకం ● దుర్వాసనతో కాలనీల్లో ఉండలేని పరిస్థితి

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులోని పరిసర ప్రాంతాలలో మురుగు వరదలా పారుతోంది. ప్రధాన రహదారిలో చేపడుతోన్న అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్మాణాలతో కాంట్రాక్టర్ చేసిన నిర్వాకంతో ఈ దుస్థితి నెలకొన్నది. కాల్వల నుంచి వచ్చే మురుగునీరు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపకుండా అడ్డుకట్టలు వేయటంతో మురుగు లోతట్టు ప్రాంతాల్లోకి చేరి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలు పడిన ప్రతిసారి నల్లపాడు రోడ్డులోని పలు ప్రాంతాల్లో వరద ముంపు స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. వర్షాలు పడ్డాయంటే చుట్టుగుంట సెంటర్ పరిసర ప్రాంతాలైన శ్రీ లక్ష్మీనగర్, సాయినగర్, హనుమాన్, శ్రీరామ్ నగర్, ఏటీ అగ్రహారంలోని కొన్ని ప్రాంతాల్లో వరద నీటి ముంపునకు గురవుతున్నాయి. భారీ వర్షాలు పడ్డాయంటే వర్షపునీరు ఇళ్ళలోకి కూడా చేరుతోన్నాయి. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రాకపోకలు సాగించాలన్నా నరకయాతన పడుతున్నారు. ఈ క్రమంలో జీటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అవుట్ ఫాల్ డ్రెయిన్ల నిర్మాణాలను చేపట్టారు. మిర్చియార్డు నుంచి చుట్టుగుంట రైతుబజారు వరకు డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇదే సమయంలో అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్మాణాలు చేస్తున్న తరుణంలో కాల్వల నుంచి వచ్చే మురుగునీటిని పక్కనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్ళించాలి. ఆ సమయంలో సమీప కాలనీల్లో పెద్దగా సమస్య రాలేదు. ప్రస్తుతం అటువంటి చర్యలు ఏమి తీసుకోకుండా మురుగునీరు ముందుకు పోకుండా అడ్డుకట్టలు వేశారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవటంతో నల్లపాడు రోడ్డులోని పరిసర కాలనీల్లో మురుగునీరు పెద్ద ఎత్తున నిలుస్తోంది. దాంతో నీరు వెనుక్కి వెళ్ళి ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తోన్నాయి. దుర్గానగర్, శ్రీ లక్ష్మీనగర్, సాయినగర్ వంటి కాలనీల్లో ఖాళీ స్థలాల్లో మురుగునీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ఫలితంగా దుర్వాసనతో ప్రజలు ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు డ్రెయిన్‌ల నిర్మాణ పనులను పరిశీలించి పరిసర కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయిన్లలో ముందుకు కదలని మురుగునీరు, వ్యర్థాలు



శ్రీ లక్ష్మీనగర్‌లో ఇళ్ళలోకి చేరుతున్న మురుగునీరు

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణ నగర్ మూడో లైన్లో గుర్తు తెలియని వ్యక్తి అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. కృష్ణనగర్ 3వ లైన్‌లోని చైతన్య గో దావరి గ్రామీణ బ్యాంకు సమీపంలో గురువారం సుమారు 50 సం వత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ మెమోలు

గుంటూరు (విద్య) మే 8 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థుల మార్కుల మెమోలు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో రేణుక గురువారం తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి మార్కుల మెమోలు డౌన్‌లోడ్ చేసుకొని వాటిల్లో తప్పులు ఏమైనా ఉంటే పాఠశాల రికార్డుల ప్రకారం సరి చేయించుకోవాలని సూచించారు. మార్కుల మెమోలో తప్పులు ఉంటే ఈనెల 25 లోగా విద్యార్థులు విద్యాశాఖ డైరెక్టరేట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుర్తింపు పత్రాలు అందజేత

గుంటూరు(తూర్పు), మే 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, డీఆర్సీ సమావేశ మందిరంలో చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులకు తాత్కాలిక గుర్తింపు పత్రాలు అందజేసే కార్యక్రమం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మీ హాజరై గుర్తింపు పత్రాలు అందజేసి మాట్లాడారు. నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ వీధి బాల, బాలికల సంక్షేమానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అధికారి సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి తగ్గట్లుగా నగరాభివృద్ధి

గుంటూరు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం అమరావతి రాజధానిలో భాగంగా ఉన్నందున అందుకు తగ్గట్టుగా నగరంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో 91లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం శంకుస్థాపన చేశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గలోని 57వ డివిజన్ బసవతారక రామనగర్‌లో 39.80 లక్షల రూపాయలతో, 54వ డివిజన్ రాజేశ్వరరావు కాలనీలో 31.70 లక్షల రూపాయలతో, 50వ డివిజన్‌లోని మల్లికార్జునపేట 2వలైన్‌లో 19.50 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించేందుకు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నామని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా నగర పాలక సంస్థ అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు పఠాన్ నూర్జహాన్, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా భక్తుల సామూహిక కుంకుమార్చనలు

శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మహోత్సవాలు

● నేడు లక్ష మల్లెలతో అర్చన

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం లక్ష మల్లెల అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బాబు), టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం, తల్లం శేఖర్, అరవపల్లి శ్రీను, గజవల్లి అంకారావు తదితరులున్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్న టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూ నాయక్ గురువారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఆయా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆయా గిరిజన ప్రాంతాల్లో తాగు నీరు, రోడ్లు, విద్య, వైద్యం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వారి జీవన విధానం దుర్భరంగా ఉంటోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. అదేవిధంగా తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలానికి చెందిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కుడుముల గోపాల్ ఇటీవలన అనారోగ్యంతో మరణించారన్నారు. ఆయనది నిరుపేద కుటుంబమన్నారు. ఆయన కుటుంబానికి ఆదుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన సీఎం గోపాల్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో సేవలు

- మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ అందించే సేవలను విస్తృతంగా, వేగంగా ప్రజలకు అందుబాటులో ఉంచేలా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్‌ను రూపొందించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జీఎంసీ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, ఎక్కువమంది నగర ప్రజలు వినియోగించుకునే విధంగా ఈ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్‌ను రూపొందించినట్లు చెప్పారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు ప్లే స్టోర్ నుంచి ఆయా మొబైల్ అప్లికేషన్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని జీఎంసీ సేవలను వేగంగా అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా జీఎంసీ

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికులు గేర్రుముచ్చు కొండమ్మ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు, కోనా రమాదేవి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్‌ను గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. అలాగే కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.



వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

స్కేటింగ్‌లో నాగదుర్గకు రెండు రజతాలు

మంగళగిరి సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తన్మయి నాగదుర్గ రెండు రజత పతకాలను సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ అండర్-11 బాలికల విభాగంలో 1500 మీటర్ల రోడ్ రేస్‌లో రజతం, 500 మీటర్ల రింక్ రేస్‌లో మరో రజత పతకం సొంతం చేసుకుంది. నాగదుర్గ మంగళగిరి నిర్మల సీబీఎస్ఈ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, మే 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌లో పడి మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని తక్కెళ్ళపాడుకు చెందిన షేక్ మీరావాలి(51)కి గత కొంతకాలంగా మానసిక స్థితి సరిలేదు. దీంతో ఆయన కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కోసం మెగా వైద్య శిబిరాలు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో లలిత సూపర్ స్పెషాలిటీ వారి సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని కాపాడలనే లక్ష్యంతో పలు వైద్య సంస్థలతో కలిసి ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా తమ సంస్థ అయిన వికాస్ ఆసుపత్రిలో ప్రతీ శుక్రవారం ఉచిత ఓపీ, అన్ని వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు చెప్పారు. దీనిని నియోజకవర్గ ప్రజలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

అన్నదానం అభినందనీయం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), మే 8(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌కు వచ్చే రోగుల బంధువులకు, పాదచారులకు అన్నదానం, మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జీజీహెచ్ వద్ద డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని, మజ్జిగ చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అన్న కాంటీన్లతోపాటు అన్నదాన కేంద్రాల ద్వారా పేదలకు ఆకలి తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ , ఏపిఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, టీడీపీ నాయకులు మద్దిరాల మ్యానీ, బొబ్బిలి రామారావు, ఘంటసాల సోమశేఖర్, కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

థలసీమియా రోగులకు మెరుగైన వైద్యసేవలు

● జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ వెల్లడి

గుంటూరు మెడికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): థలసీమియా రోగులకు అన్ని రకాల వైద్య సేవలు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ తెలిపారు. వరల్డ్ థలసీమియా డే పురస్కరించుకొని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రి శుశృతహాల్‌లో థలసీమియా వ్యాధిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ కన్సల్టెంట్ (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెల్) డాక్టర్ సోనియా మోహన్ అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోనియా మోహన్ మాట్లాడుతూ థలసీమియా రోగులకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (బీఎంటీ) శస్త్రచికిత్సతో వ్యాధి నుంచి శాశ్వత విముక్తి కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ అపర్ణ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని తో పాటు థలసీమియా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన ఉండాలి

గుంటూరు(తూర్పు), మే 8(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు అన్నారు. గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జరిగే మెట్రాలజీ డే కార్యక్రమాలను స్థానిక కృష్ణానగర్ రైతు బజారులో ప్రారంభించారు. జిల్లా ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాటాల మీద ఏ వస్తువును ఉంచకూడదనే నియమాన్ని కొంత మంది వ్యాపారుస్తులు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మే 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై జూన్ 5వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా పిలుపు నిచ్చారు. గురువారం మెడికల్ కళాశాల అవరణలోని సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ సమస్యలే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న సభకు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు పెద్దఎత్తున హాజరవ్వాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువస్తామని స్పష్టం చేశారు.



డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ జవహర్

మహనీయుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య

● యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ ఎస్ జవహర్

గుంటూరు(తూర్పు), మే 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రానికి పూర్వమే ఆంధ్రా బ్యాంక్‌తో పాటు అనేక ఆర్థిక, బీమా సంస్థలను స్థాపించి తెలుగువారి కీర్తిని దశ, దిశలా చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అని యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ సయ్యద్ జవహర్ కొనియాడారు. ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుంటూరు, నరసరావుపేట రీజియన్స్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజీ యూనియన్ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ ఏ రాజేంద్రప్రసాద్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కే హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ డీఎస్‌వోగా స్టెప్ సీఈవో చంద్రముని

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ మూడు నెలల పాటు సెలవు పెట్టారు. వ్యక్తిగత పని మీద ఆమె అమెరికా దేశానికి శుక్రవారం బయలుదేరి వెళుతున్నారు. ఇందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అనుమతి కూడా మంజూరైంది. దీంతో స్టెప్ సీఈవో చంద్రమునిని ప్రభుత్వం ఇన్‌ఛార్జ్ డీఎస్‌వోగా నియమించింది. కోమలి పద్మ తిరిగి వచ్చి విధుల్లో చేరేంత వరకు చంద్రముని ఇన్‌ఛార్జ్ డీఎస్‌వోగా కొనసాగుతారు.

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసులు

గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) , కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 22 వరకు ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసులు బ్రాడీపేట 2/6వ లైనులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ క్లాసులు రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పది రోజుల పాటు జరుగుతాయన్నారు. సివిల్ సర్వీస్, ఐఏఎస్ పరీక్షల పట్ల పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించి, నిపుణుల ద్వారా క్లాసులు అందించటమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 6309481514, 7995902645 ను సంప్రదించాలని కోరారు.

నేడు తాడికొండలో సర్వసభ్య సమావేశం

తాడికొండ, మే 8(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనున్నది ఎంపీడీవో కే.సమతావాణి గురువారం పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలియజేశారు.

పెదనందిపాడు ఆర్ఐగా అబిదాలీ

పెదనందిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ అబిదాలీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటస్వామికి నియామకపత్రాన్ని అందజేసి, బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సాహితీమోహన్ తెనాలి సివిల్ సప్లయిస్ ఆర్ఐగా బదిలీపై వెళ్లారు.

నేడు మలినేనిలో మెగా జాబ్ మేళా

వట్టిచెరుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్ మేళా నిర్వాహణకు ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు, మలినేని విద్యా సంస్థల చైర్మన్ విస్తృత ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెగా జాబ్ మేళాకు తరలి వచ్చే ప్రముఖ కంపెనీల అధికారులు, అలాగే జాబ్ మేళాకు తరలి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎమ్మెల్యే రామాంజనేయులు అధికారులతో చర్చించారు. ఈ మేరకు శుక్రవారం జరగనున్న జాబ్ మేళాకు సంబంధించి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు.

షైన్ ఆనంద శరణాలయానికి ప్రభుత్వం గుర్తింపు

మంగళగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): చినకాకాని గ్రామంలోని షైన్ ఆనంద శరణాలయానికి బాల్య సంక్షేమ దిద్దుబాటు సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ గుర్తింపు లభించింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ గుర్తింపు పత్రం అందుకున్నారు. జిల్లాలో 22 సేవాసంస్థలకు గుర్తింపు పత్రాలను అందజేయగా, వాటిలో షైన్ ఆనంద శరణాలయం కూడా ఉంది. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ శరణాలయంలో 50 మంది బాలురకు, 30 మంది బాలికలకు అనుమతిస్తూ ప్రభుత్వం గుర్తింపు అందజేసిందని, భవిష్యత్తులో బాలబాలికలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

వజ్రోత్సవాలకు ఏర్పాట్లు

పెదనందిపాడు, మే, 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో శ్రీనారసింహ జిల్లాపరిషత్ హైస్కూల్ వజ్రోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు కమిటీ ఆహ్వాన కమిటీ సభ్యులు మేరుగల మణికుమార్, ముద్దన రమేష్‌లు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య తదితరులు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, డీఈవో సీవీ రేణుక, పాల్గొననున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



దుగ్గిరాలలోని శ్రీకోదండ రామచంద్ర స్వామి ఆలయానికి శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడి పంచలోహ విగ్రహాలను అందించారు. హైద్రాబాద్‌లో స్థిరపడిన దుగ్గిరాల గ్రామవాసి పిన్నిబోయిన శివ కుమార్, ఆదిలక్ష్మి దంపతులు కుంభకోణం నుంచి తెప్పించిన పంచ లోహ ఉత్సవ మూర్తులను ఆలయానికి సమర్పించారు.
(దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి శివాలయంలో కల్యాణోత్సవాలు

దుగ్గిరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీ. శ్రీనివాసవర్మ తెలిపారు. 12వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగే కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం రాత్రి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు అర్చకుడు ఈవో తెలిపారు.

ఆర్థిక సాయం

తాడేపల్లి (పెనుమాక), మే 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పఠాన్ సైదా భార్య అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకున్న పెనుమాక గ్రామానికి చెందిన కొల్లి సురేష్ ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేసిన కొల్లి సురేష్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కళ్లం గోవిందరెడ్డి, కళ్లం చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

తాడేపల్లి టౌన్, మే 8, (ఆంధ్రజ్యోతి): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ నూతన కమిటీ ఏర్పాటు గురువారం జరిగింది. అధ్యక్షుడిగా పీ భాస్కరరావు, యూత్ అధ్యక్షుడిగా నక్క నవీన్‌రాజా, సెక్రటరీగా పూడి రమణ, కోశాధికారిగా తాడికొండ నాగేశ్వరరావు, యూత్ ప్రచార కార్యదర్శిగా అడపా నరేష్, పట్టణ ఉపాధ్యక్షుడిగా వెంకటమోహనరావు, తదితరులు నియమితులయ్యారు.

త్వరలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

- కుట్టు శిక్షణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బూర్ల
- మహిళల అభ్యున్నతికి మరెన్నో కార్యక్రమాలు
- పెదనందిపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రత్తిపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు అనాదిగా పాటు పడుతూనే ఉన్నాడని, అందులో బాగంగానే త్వరలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా కల్పిస్తారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. మండలపరిషత్ కార్యాలయ ఆవరణలోని సచివాలయంలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తే, చంద్రబాబు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు డ్వాక్రా ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యమిచ్చారన్నారు. కుట్టు శిక్షణలో నైపుణ్యం సంపాదించిన వారికి పరీక్షలు పెట్టి, అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి మిషన్‌తో పాటు ఫ్యాషన్ టెక్నాలజీలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. త్వరలోనే స్కూలు పిల్లల యూనీఫామ్‌ను కుట్టించే ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు శివరామప్రసాద్, ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవో రమాదేవి, అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ఉపాధిహామీ నిధులతో గ్రామాల అభివృద్ధి

పెదనందిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. మండలపరిధిలోని కత్రపాడు, నాగులపాడు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా తాగునీటి చెరువుల పూడికతీత పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు గ్రామాల్లో సుమారు రు.20లక్షలతో పనులు చేపట్టనున్నట్లు, దీంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. పొలాల్లో మెరకలు తోలేందుకు మట్టి అవసరమైతే రైతులకు ఇవ్వాలని తెలిపారు. అనంతరం నాగులపాడు ఎస్సీ కాలనీలో శ్మశానంలో వర్షం పడితే కర్మకాండలు చేసేందుకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, మట్టితోలి మెరక వేయాలని సంఘ పెద్దలు కోరగా, మెరక వేసి, ప్రహరీ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పెదనందిపాడు గ్రామ సచివాలయం-2లో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, మాజీ మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోపర్తి చెంచయ్య, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, కాండ్రు ప్రసాద్, గ్రామ అధ్యక్షులు రమేష్, రావి శివరామకృష్ణయ్య, బండి నాగబాబు తదితరులు, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ బీ వెంకటస్వామి, ఏపీవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఒకవైపు మంటలు.. మరోవైపు వర్షంతో రైతులు విలవిల

- ఎండిన ఆకుకు పెట్టిన నిప్పుతో 12 ఎకరాల పంట దగ్ధం
- మరోవైపు ఆకస్మిక వర్షంతో తడిసిన మొక్కజొన్న



మంటల్లో కాలిపోయిన మొక్కజొన్న కండెలు



తడిసిన మొక్కజొన్నను పట్టాలతో కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న రైతులు

దుగ్గిరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో కల్లాల్లోని మొక్కజొన్న పంట పూర్తిగా తడిసిపోగా, మరోవైపు ఎండిన పంటకు పెట్టిన నిప్పుతో వ్యాపించిన మంటలు, పరిసరాల్లోని రెండ్రోజులుగా కోసి రాశిపోసిన మొక్కజొన్నకు అంటుకోవడంతో రైతులను నష్టాల్లో ముంచింది. ఈమనికి చెందిన రైతులు కొమ్ము గోపి, అక్రమశెట్టి మహేష్‌లు మహంకాళీ అమ్మవారి ఆలయ దేవుడిమాన్యంలో 12 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఇటీవలే కోత కోసిన పంట కొంత ప్రోగుచేయగా, మరోవైపు మధ్యాహ్నం కురిసిన ఆకస్మిక వర్షంతో పూర్తిగా తడిసిపోయింది. ఎకరం రూ.40వేలకు పాట పాడి దక్కించుకుని ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయానికి ఇంత పెద్దదెబ్బ తగలడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుతో మంటలు పరిసరాల్లోని మరికొందరు రైతు ల పంటను కూడా దగ్ధం చేశాయి. సమీపంలోనే పొలాల్లో కోసియున్న దుగ్గిరాలకు చెందిన లంకె నారాయణమ్మకు చెందిన రెండెకరాల పంట మంటల్లో కాలి విక్రయించేందుకు వీల్లేకుండా పోయిందని వాపోయింది. తమకు జరిగిన నష్టాన్ని కొంతైనా తీర్చి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనాలోచితంగా పెట్టిన నిప్పు అనర్థానికి దారితీసింది

తమ పరిసరాల్లో మొక్కజొన్నదంటుకు గుర్తు తెలియని వ్యక్తులు అనాలోచితంగా పెట్టిన నిప్పు తమను కష్టాల్లోకి నెట్టిందని, రూ.7లక్షల వరకూ నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఈమని కి చెందిన కౌలు రైతులు కొమ్ము గోపి, అక్రమశెట్టి మహేష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో అప్పులు తెచ్చి మరీ పండిస్తున్నానని, ఇప్పుడీ నష్టం నుంచి ఎలా బయటపడాలో దిక్కుతోచడం లేదని గోపి వాపోయారు. డిగ్రీ చదివిన తాను వ్యవసాయం చేస్తూనే పీజీ చేస్తున్నానని ఇప్పుడిలా లక్షలాది రూపాయలు నష్టాన్ని చూడాల్సి రావడం నిరాశకు గురిచేస్తోందని మహేష్ వాపోయారు.

గుడిప్రతిష్ఠకు వెళ్లివచ్చేసరికి కాలిపోయింది

రెండెకరాల మొక్కజొన్న పంటను కోసి, రేపోమాపో విక్రయించాలని ఎదురు చూస్తుండగా అగ్నికి ఆహుతైందని, తమ దురదృష్టాన్ని నిందించుకోవడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి నెలకొందని దుగ్గిరాలకు చెందిన మహిళా రైతు లంకె నారాయణ కన్నీటి పర్యంతమైంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

బుద్ధ పూర్ణిమ వేడుకలను జయప్రదం చేయాలి

మంగళగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్‌లో బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తెలిపారు. రాయల్ బాంకెట్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 23 సంవత్సరాలుగా మంగళగిరి బుద్ధ విహార ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ పూర్ణిమ వేడుకలను ఈ మారు మానవతా వేదిక తరఫున నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 25వ బుద్ధ పూర్ణిమ వేడుకలను రజతోత్సవంగా జరుపుతున్నట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు వెల్లడించారు. ఇదే వేదికపై ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాహుస్సేన్ రచించిన 'కళల సిరి.. మంగళగిరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్టు చెప్పారు. గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుడి బోధనలు ఎంతో ఆవశ్యమని అన్నారు. ప్రజలందరూ బుద్ధ పూర్ణిమ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లా బత్తుని లక్ష్మణరావు, ధ్యానరత్న ఆకురాతి శంకరరావు, ప్రజానాట్య మండలి కళాకారుడు కంచర్ల కాశయ్య, నందుపట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సేద్యపు నీటి కుంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

- డ్వామా పీడీ శంకర్



సేద్యపు నీటి కుంటలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శంకర్

పెదనందిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ నీటి కుంటలపై రైతులకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ వీ శంకర్ అన్నారు. మండల పరిధిలోని కత్రపాడులో గురువారం నీటి కుంటలను పరిశీలించారు. పొలాల్లో తవ్వే నీటికుంటలకు అదనపు కూలీలను ఏర్పాటు చేసి త్వరగా పూర్తి చేయాలని, అలా పూర్తి చేసిన వారికి కాలువల పూడికతీత పనులు ఇస్తామని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనిదినాలు కల్పించాలని, కూలీల పనిదినాల్లో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన నిర్మాణంసరే.. నగదు చెల్లింపులేవి అనే కథనంపై స్పందిస్తూ వారం రోజుల్లో బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. ఆయన వెంట టీఏ శ్రీనివాసరావు ఉన్నారు.

రేపటి నుంచి వరాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధనోత్సవాలు

వట్టిచెరుకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోని వరాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆరాధన మహోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ సిద్ధాంతి రాఘవ ఆరాధన మహోత్సవాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 10వ తేదీ ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పతాకావిష్కరణ, వినాయక పూజ, 11న స్వామికి పసుపు, కుంకుమ సుగంధ ద్రవ్యాలతో అభ్యంగన స్నానం, పెళ్ళికుమారుడిని చేయటం కార్యక్రమాలను నిర్వహిస్తారని సిద్ధాంతి తెలిపారు.

వైభవంగా శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగు పాడు గ్రామంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు శ్రీసీతా రామచంద్ర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీఆంజనేయ స్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుపనున్నామని ఆలయ కమిటీ తెలిపింది. 8వ తేదీన గ్రామయాత్ర కళాకారులతో జరపనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. అలాగే అయ్యప్ప నామ సంకీర్తన జరుగుతుందన్నారు. 9వ తేదీ శ్రీసీతారామాంజనేయ భజన సమాజం పొనుగుపాడు వారిచే భక్తి సంకీర్తన, అయోధ్య రామ మహిళా కోలాటం, అన్నమయ్య కీర్తనలు జరుగుతాయన్నారు. 10వ తేదీ కల్యాణం జరపనున్నట్టు వారు తెలిపారు.

సాయిబాబాకి ప్రత్యేక పూజలు.. పేదలకు అన్నదానం

తుళ్లూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పెదపరిమి, తుళ్లూరు బాబా మందిరాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కాగడా హారతులిచ్చారు. భక్తులకు బాబా వారి నైవేద్యాన్ని అందజేసారు. ఈ సందర్భంగా వృద్ధులకు, భిక్షాటకులకు, సాయి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి గురువారం బాబాకి పూజలు నిర్వహించి, పేదలకు అన్నదానం చేస్తున్నట్టు కమిటీ తెలిపింది.

విద్యా కుసుమాలకు అభినందన



విద్యార్థిని సత్కరిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో విద్యా కుసుమాలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులను రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి పారదర్శక పాలనలో ప్రభుత్వ పాఠశాలలు ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఇకపై ప్రతి ఏటా విద్యా కుసుమాలకు అభినందన కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీదేవి తెలియజేశారు.

కన్నుల పండువలా రుక్మిణీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన రుక్మిణీ అమ్మవారి విగ్రహం

ప్రత్తిపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండేపాడులో శ్రీ వేణు గోపాలస్వామి వారి దేవాలయంలో రుక్మిణీ అమ్మవారి విగ్రహ పరిష్టతో పాటు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం కనుల పండువలా జరిగింది. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం వేలాది మంది భక్తుల సమక్షంలో వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

మోతడక చలపతిలో కంటి వైద్యశిబిరం

తాడికొండ(మోతడక)మే 8(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో గుంటూరు మెడెక్స్ సూపర్ స్పెషాలిటి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బుధ, గురువారాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు మెడెక్స్ హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. పరీక్షలు నిర్వహించిన వారిలో కొంత మంది విద్యార్థులకు లాసిక్ సమస్యలు, కొందరు ఉపాధ్యాయులకు, సిబ్బందికి కంటి శుక్లాల సమస్యల గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ దావులూరి శ్రీనివాసరావు, మెడికల్ డైరెక్టర్ మాధవీలత క్యాంపు కో-ఆర్డినేటర్ లక్కా నాగరాజు, మెడెక్స్ సిబ్బంది సీహెచ్ అనూష్, రాజశేఖర్, కళాశాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

తుళ్లూరు, మే8:(ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం తుళ్లూరు గ్రంథాలయంలో కొనసాగుతుంది. విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 28 నుంచి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ గురించి గ్రంథాలయ అధికారి టీ గిరిధర్ అవగాహన కల్పించారు. వేసవి శిబిరం విద్యార్థులకు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచి ఇటువంటి విజ్ఞాన శిబిరాలకు పంపించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞానదివ్యకు 4 పతకాలు



జ్ఞానదివ్యను అభినందిస్తున్న కోటేశ్వరరావు

మంగళగిరి సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లాకు చెందిన నాగం జ్ఞానదివ్య నాలుగు పతకాలు సాధించింది. 84 కిలోలు పైబడిన విభాగంలో స్క్వాట్‌లో రజత పతకం, బెంచిప్రెస్‌లో కాంస్యం, డెడ్ లిఫ్ట్‌లో రజతం, ఓవరాల్‌గా కాంస్య పతకం సొంతం చేసుకుంది. తెనాలికి చెందిన జ్ఞానదివ్య అంతర్జాతీయ పవర్ లిఫ్టర్, కోచ్ ఘట్టమనేని సాయిరేవతి వద్ద శిక్షణ పొందుతోంది. పతకాలు సాధించిన జ్ఞానదివ్యను రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని గురువారం తెలిపారు.

స్కేటింగ్‌లో నాగదుర్గకు రెండు రజతాలు



మెడల్ అందుకుంటున్న తన్మయి నాగదుర్గ

మంగళగిరి సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీ ల్లో మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తన్మయి నాగదుర్గ రెండు రజత పతకాలను సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ అండర్-11 బాలికల విభాగంలో 1500 మీటర్ల రోడ్ రేస్‌లో రజతం, 500 మీటర్ల రింక్ రేస్‌లో మరో రజతం సొంతం చేసుకుంది. నాగదుర్గ మంగళగిరి నిర్మల సీబీఎస్ఈ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది. జాతీయ స్థాయిలో సత్తా చాటిన నాగదుర్గను పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు ఎస్కే ఖాజా, సుధాకర్ అభినందించారు.

వైభవంగా శ్రీకోదండరామాలయం పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠించిన శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహాలు

దుగ్గిరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని యాదవపాలెంలో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీకోదండరామచంద్ర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఐదు రోజులుగా జరిగిన ప్రతిష్ఠా ఉత్సవాలు, టీటీడీ ఆగమ సలహాదారుడు శ్రీవిష్ణుభట్టాచార్య నేతృత్వంలో ఉదయం 6.30ని.లకు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యంత్రారాధన, యంత్రస్థాపన, రత్నన్యాసానంతరం వృషభలగ్నం కృష్ణపక్షం ఏకాదశి గురువారం ఉదయం 7గం.56ని.లకు శ్రీసీతారామలక్ష్మణ హనుమంతులవారి విగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గం.10.25ని.లకు స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో వేదపండితుల వేదమంత్రాల మధ్య పలువురు దంపతులు శాంతి కల్యాణంలో పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం, మండలానికి సంబంధించి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక టీడీపీ నేతలు గురువారం పంపిణీ చేశారు. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోలి అరుణకు రూ.2,54,441, సూర్యనారాయణ నగర్‌కు చెందిన ఆదిమళ్ల చిట్టెమ్మకు రూ.81 వేలు, మండలంలోని నవులూరు గ్రామానికి చెందిన చదలవాడ లక్ష్మీసుధకు రూ.లక్షా 50 వేలు, కే కోటేశ్వరరావుకు రూ.లక్షా 30 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. తమకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, నేతలు అంకమ్మరావు, పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..



చిలువూరులో సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కును అందిస్తున్న ఎంపీపీ జబీన్, శ్రీఅనిత, జయలక్ష్మి, సీతారామయ్య తదితరులు

దుగ్గిరాల, మే 8(ఆంధ్రజ్యోతి): చిలువూరులోని ఎస్సీ కాలనీకి చెందిన నరేంద్రకు శస్త్రచికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.60వేల నగదు చెక్కును ఎంపీపీ షేక్ జబీన్ చేతులమీదుగా గురువారం అందించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నరేంద్ర సాయం కోసం స్థానిక టీడీపీ నాయకులను కలిసి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించారు. స్పందించి సాయం అందించిన లోకేశ్‌కు నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదపరిమిలో ఇత్తడి, రాగి బిందెలు చోరీ

తుళ్లూరు (పెదపరిమి), మే 8, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదపరిమిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఇత్తడి, రాగి బిందెలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెంది సుబ్రహ్మణ్య శర్మ పాత పెంకుటిల్లులో గతంలో నివాసం ఉండేవారు. తరువాత అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఉమ్మడి ఆస్తిగా ఉన్న రాగి ఇత్తడి వస్తువులు పంచుకోలేదు. వాటిని రెండు గోతాల్లో మూట గట్టి పాత పెంకుటింటిలో భద్రపరిచారు. గురువారం ఉదయం కరెంటు బిల్లు తీయటం కోసం వెళితే తలుపు గడియ విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా కొన్ని వస్తువులు చల్లా చెదురుగా పడేసి ఉన్నాయి. మచ్చు మీద ఉన్న రాగి, ఇత్తడి వస్తువుల గోతాల మూటలు చోరీ జరిగినట్టు గుర్తించారు. వీటి విలువ సుమారు. రూ.80 వేలు వరకు ఉంటాయని శర్మ తెలిపారు. దీనిపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్

తెనాలి రూరల్, మే8(ఆంధ్రజ్యోతి): నియోజవర్గ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ శ్రేణులు తెలిపారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి టీడీపీ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5 వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు తెలపాలనుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న స్టెప్ సీఈవో చంద్రముని

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తెనాలి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్టెప్ సీఈవో చంద్రముని పేర్కొన్నారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, డ్రగ్ అబ్యూజ్, ఉమెన్ ట్రాఫికింగ్, ఈవ్ టీజింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అంశాలలో సమాచారం అందితే పోలీసులకు టోల్ ఫ్రీ నెం.1930కి తెలపాలని కోరారు. చట్టంలోని వివిధ సెక్షన్లను వివరించి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. జార్జిబాబు, వి.రాధిక, శ్రీధర్‌బాబు, కొలసాని రాంచంద్ ప్రసంగించారు.


సత్యసాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

వైభవంగా సత్యసాయిబాబా విగ్రహప్రతిష్ఠ

కొల్లిపర, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్తోటలో గురువారం సత్యసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొఠారు అంజనేయులు, దాసరి నరసయ్య, ముంగర బుల్లి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖల తనిఖీలతో 486 కేసులు నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

పొన్నూరుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై 486 కేసులు నమోదు చేసినట్లు విద్యుతశాఖ ఈఈ జి.భాస్కరరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో 39 బృందాలతో విద్యుత్ వాడకంపై ఆకస్మిక తనిఖీలు జరిగాయి. లోడ్‌కు మించి వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగించే వారిని గుర్తించి 486 కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విద్యుత్ శాఖ డీఈఈ జీ శ్యామ్‌కుమార్, రూరల్ ఏఈ వెంకట నారాయణ, పలు మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2.5 ఎకరాల మొక్కజొన్న పైరు దగ్ధం

పొన్నూరుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పచ్చలతాటిపర్రు గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో 2.5 ఎకరాల మొక్కజొన్న పైరు దగ్ధం అయింది. గ్రామానికి చెందిన ఆరెమండ్ల ఏసు అనే రైతు మొక్కజొన్న కండెలు పొలంలోనే ఆరబెట్టారు. సమీపంలో ఉన్న పంట పొలాల్లోని మొక్కజొన్న వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిచండంతో మంటలు వ్యాపించి ఏసు పొలానికి కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో మొక్కజొన్న వ్యర్థాలతో పాటు కండెలు కూడా కాలిపోయాయి.


తగలబడిన మొక్కజొన్న పైరు

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, మే 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌లో పడి మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని తక్కెళ్ళపాడుకు చెందిన షేక్ మీరావలి(51)కి గత కొంతకాలంగా మానసిక స్తితి సరిలేదు. దీంతో ఆయన కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కొలకలూరు శివారు కఠెవరం సమీపంలోని కాలువలో గ్రామస్తులు గురువారం గుర్తించారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని కాలువ నుండి వెలికితీశారు. మృతుడి ఒంటిపై చొక్కా లేకపోవడం, లుంగి ధరించి ఉబ్బి ఉండటాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారుగా 35-50 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. ఆరు నుండి ఏడు రోజుల క్రితం మృతిచెందినట్లు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు మృతదేహాన్ని తరలించి గ్రామ వీఆర్వో-2 నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ-2 శ్రీనివాసరావు తెలిపారు.

కుంభవృష్టి

- తడిసిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు
- ఆందోళన చెందిన రైతులు
- విరిగిన చెట్ల కొమ్మలు
- రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయం


కొల్లిపర: తూములూరులో నీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు


కొల్లిపర: తూములూరులో మొక్కజొన్నకు కప్పిన పట్టలపై నిలిచిన వర్షపు నీరు

కొల్లిపర, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించింది. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. అధికంగా వర్షం నీరు చేరడంతో గృహాల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గజం లోతు నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారు. కొల్లిపరలో ప్రధాన రహదారులు నీటితో నిండిపోయాయి. శివాలయం దగ్గర నుంచి గ్రామపంచాయతీ వరకు నీటితో నిండిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులకు గురయ్యారు. గాలితో కూడిన వర్షం పడటంతో దావులూరు అడ్డరోడ్డు సమీపంలో ప్రధాన రహదారిపై చెట్టు పడిపోయింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

● కొల్లిపర మండలంలో గురువారం మధ్యాహ్నం మబ్బులు కమ్మి కుంభవృష్టిగా వర్షం పడింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలను రైతులు పట్టాలు కప్పిరక్షించుకున్నా కుంభవృష్టిగా వర్షం పడటంతో పట్టాలపై నీళ్ల నిలిచాయి. వర్షం కారణంగా ఇటుక పరిశ్రమ రైతులకు అపారమైన నష్టం వాటిల్లింది. ఇటుక రాయి మూడు రోజుల నుంచి నీటిలో నానటంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఇటుక పరిశ్రమ రైతులు తెలుపుతున్నారు.

తెనాలిలో...

తెనాలి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో రెండు గంటలకు పైగా వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి. వర్షపు నీరు పారే కాల్వలన్నీ నిండుగా ప్రవహించడంతో రహదారులు, మురుగు కాల్వలు ఏకమయ్యాయి. బోసురోడ్డు, గాంధీనగర్, పినపాడు తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలబడింది. నాలుగు లైన్ల రహదారిలో వాన నీరు పోయేందుకు ఏర్పాటుచేసిన గొట్టాలకు గడ్డి, రాళ్ళు, మట్టి అడ్డుపడటంతో నీరు నిలబడిపోయింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో పట్టణ ప్రజలు సేదతీరారు.




తెనాలి: నాలుగు లైన్ల రహదారి, బోసురోడ్డులో నిలిచిన వర్షపు నీరు

అర్హులందరికీ ఉపకరణాలు అందిస్తాం

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అర్హత ఉన్న వారందరికి ఉపకరణాలు, సహాయకపరికరాలు అందిస్తామని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న చెప్పారు. గురువారం పట్టణంలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో రాష్ట్రీయ వయోశ్రీయోజన ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ కోసం భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఉపకరణాల, సహాయక పరికరాల ఉచిత పంపిణీ గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకూ జరిగిన శిబిరానికి 200 అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు టీజీ వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయక సంచాలకులు సీహెచ్ సువర్ణ, కొల్లిపర ఎంపీడీవో విజయలక్ష్మి, తెనాలి ఎంపీడీవో అత్తోట దీప్తి, ఓఎస్డీ ఏసురత్నం, పలుశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అప్లికేషన్లను స్వీకరిస్తున్న కమిషనర్ శేషన్న

బుద్ధ పూర్ణిమ వేడుకలను జయప్రదం చేయాలి

మంగళగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్‌లో బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తెలి పారు. రాయల్ బాంకెట్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 23 సంవత్సరాలుగా మంగళగిరి బుద్ధ విహార ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ పూర్ణిమ వేడుకల ను ఈ మారు మానవతా వేదిక తరపున నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 25 వ బుద్ధ పూర్ణిమ వేడుకలను రజతోత్సవంగా జరుపుతున్నట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు వెల్లడించారు. ఇదే వేదికపై ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాహుస్సేన్ రచించిన 'కళల సిరి.. మంగళగిరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్టు చెప్పారు. గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుడి బోధనలు ఎంతో ఆవశ్య మని అన్నారు. ప్రజలందరూ బుద్ధ పూర్ణిమ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లా బత్తుని లక్ష్మణరావు, ధ్యానరత్న ఆకురాతి శంకరరావు, ప్రజానాట్య మండలి కళాకారుడు కంచర్ల కాశయ్య, సందుపట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మలినేనిలో మెగా జాబ్ మేళా

వట్టిచెరుకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్ మేళా నిర్వాహణకు ఏపీఎస్ ఎస్‌డీసీ అధికారులు, మలినేని విద్యా సంస్థల ఛైర్మన్ విస్తృత ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెగా జాబ్ మేళాకు తరలి వచ్చే ప్రముఖ కంపెనీల అధికారులు, అలాగే జాబ్ మేళాకు తరలి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎమ్మెల్యే రామాంజనేయులు అధికారులతో చర్చించారు. ఈ మేరకు శుక్ర వారం జరగనున్న జాబ్ మేళాకు సంబంధించి రెండు రోజులుగా విస్తృతంగా ఆటోల ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు.

అధికారులతో మంత్రి మనోహర్ సమావేశం

తెనాలిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అధికారులతో గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జొన్న, మొక్కజొన్న ఇతర పంటల కొనుగోళ్లపై మంత్రి మనోహర్ అధికారుల నుండి వివరాలు సేకరించారు. ప్రతి రైతుకు మంచి జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. వివిధ విభాగాల అధికారులతో ఆయా శాఖల పరమైన పనులపై పలు సూచనలు చేశారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తెనాలి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు లోడ్ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని సుల్తానాబాద్‌లో గురువారం ఫ్లోర్ మిల్ వద్ద రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు డీటీతో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో 48 బస్తాల పీడీఎఫ్ బియ్యాని గుర్తించామన్నారు. వీటిని లోడ్ చేసే సభ్యులు పరారయ్యారని తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సందేశాత్మకంగా సాగుతున్న నాటిక పోటీలు

పొన్నూరుటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు గురువారం సందేశాత్మకంగా సాగాయి. కొల్లా రమేష్ కళా ప్రాంగణంలో రెండవ రోజు కొల్లా స్వాతి ఆధ్వర్యంలో నటరాజ పూజతో నాటక పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఘంటసాల చతుర్వి, తమ్మా అన్విత రెడ్డి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. కాపూరి సత్యనారాయణ రచనలో ఏహూరి హరిబాబు దర్శకత్వంలో గుంటూరు అమరావతి ఆర్ట్స్‌వారి చిగురు మేఘం నాటికను ప్రదర్శించారు. ఆదునిక వైద్యం, సామాన్యుడికి అందుబాటులో లేకపోవడం కార్పొరేట్ హాస్పిటల్‌లో డబ్బు సంపాదనే ధ్యేయంగా విలువలు కోల్పోయి మానవత్వానికి కళంకం తెస్తున్న కొందరి వైద్యుల ఇతి వృత్తంతో చిగురు మేఘం నాటిక ప్రదర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యనభ్యసించిన అనంతరం సామాన్యులకు వైద్య సేవలు చేస్తామని ప్రతిజ్ఞ చేసే ప్రతి వైద్యుడు వైద్య వృత్తితోకి వచ్చిన తరువాత కార్పొరేట్ హాస్పిటల్స్‌కు, వాటి నిర్వాహకులకు అనుగుణంగా వ్యవహరిస్తూ సొంత తల్లిదండ్రులను కూడా నిరాదరణకు గురి చేస్తున్నారని నాటిక కళ్లకుకట్టింది. రెండవ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మ స్వరూపం నాటికను టీవీ పురుషోత్తం దర్శకత్వంతో ప్రదర్శించారు. మంచితనంతో జీవనం సాగిస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ మంచి వారులాగానే కనిపిస్తారు. ప్రపంచం అంతా ఆత్మీయతలు అభిమానాలు, మమకార మాధుర్యాలు, ప్రదర్శించబడుతుంటాయి. అలాంటి ఆహ్లాదకరమైన జీవితంలో ఊహకు అందని కష్టాలు వచ్చినప్పుడు ఎదుర్కొనే ప్రతికూల మనస్తత్వాలతో సాగిన కథాంశంతో బ్రహ్మ స్వరూపం నాటికను ప్రదర్శించారు. నాటిక పోటీలను ప్రగతి కళా మండలి గౌరవ అధ్యక్షుడు నూతలపాటి సాంబయ్య, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, తదితరులు అతిధిలుగా హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు పట్టణానికి చెందిన కళారత్న అవార్డు గ్రహీత వైఎస్ కృష్ణేశ్వరరావును ఘనంగా సత్కరించారు. పల్నాటి పుల్లరి ఉద్యమ స్వతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు బుర్రకథ ప్రత్యేక ప్రదర్శన నాటక రంగ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.


చిగురుమేఘం నాటికలో సన్నివేశం


రిబ్బన్ కట్‌చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

● సబ్‌కలెక్టర్ సంజనసింహ

తెనాలిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనసింహ అన్నారు. గురువారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా పాత ప్రభుత్వవైద్యశాల వద్ద ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సబ్‌కలెక్టర్ సంజనసింహ, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి చైర్మన్ భానుమతితో కలిపి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి నాలం శ్రీమన్నారాయణ, జిల్లా కో ఆర్డినేటర్ జానీరసూల్, నిర్వాహక సభ్యులు కుర్రా శ్రీనివాస్, కొత్త కృష్ణకుమార్, కొంజేటి మురలి, డాక్టర్ పావని ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యోగ నరసింహస్వామిగా భావదేవుడు

పొన్నూరుటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు యోగ నరసింహుడిగా పూజలందుకున్నారు. ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకాలతో తిరుమంజనోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం యోగ నరసింహస్వామిగా ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగ నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై పూజాదికాలు నిర్వహించారు. పట్టణ వీధులలో భావదేవుడు విహరించారు.


యోగ నరసింహుడిగా దర్శనమిస్తున్న భావనారాయణ స్వామి

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

● సిబార్ దంత వైద్య కళాశాలలో ఘనంగా ప్రపంచ తలసేమియా డే


జ్యోతి ప్రజ్వల చేస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, పక్కన సిబార్ డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ తదితరులు

పెదకాకాని, మే 8(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో వరల్డ్ తలసేమియా డే సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి అరుదైన ప్రాణాంతక తలసేమియా బాధితులకు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఉన్నత ఆశయంతో రక్తదానం చేస్తున్న కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులను అభినందనలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రక్తాన్ని అందిస్తున్న వారికి పండ్లను, ప్రశంసాపత్రాలను అందించారు. తొలుత సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని క్రిష్ణప్రసాద్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ క్రిష్ణ మోహన్, ప్రొఫెసర్ డాక్టర్ పి.రేవతి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి కళాశాలలోని పలు విభాగాలను చూపించారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో అందిస్తున్న దంత వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణబాబు, తహసీల్దార్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

తెనాలి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నగదు తీసుకుని మోసం చేసిన ఘనటపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని చినరావూరు తోటకు చెందిన నరసింహారావు తనకు పలుకుబడి ఉందని అదే ప్రాంతానికి చెందిన కె.సుబ్బారావుకు చెప్పి అతడి కుమారుడికి పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన సుబ్బారావు ఐదేళ్ల క్రితం రూ.15లక్షలు నరసింహారావుకు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా కుమారుడికి మాత్రం ఉద్యోగం రాకపోవడంతో సుబ్బారావు అతడిని ప్రశ్నించాడు. ఫలితం లేకపోవడంతో తాము మోసపోయామని తన డబ్బులు తనకు తిరిగి చెల్లించాలని నరసింహారావును కోరినా ప్రయోజనం లేదు. దీంతో గురువారం బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ-తెనాలి మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 30 సంవత్సరాల యువకుడు ట్రైన్ నుండి జారిపడి మృతి చెందాడని తెనాలి రైల్వేపోలీసులు తెలిపారు. మృతుని వద్ద విజయవాడ- తెనాలి జనరల్ టికెట్ ఉందన్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

● సీఐటీయూ బాబుప్రసాద్

తెనాలిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కె.బి.బాబుప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పినపాడు వద్దగల పౌరసరఫరాలశాఖ స్టాక్‌పాయింట్‌లో పనిచేసే ముఠా కార్మికులను సీఐటీయూ నాయకులు కలిసి సమ్మెకు మద్దతుగా ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఎస్కే హుస్సేన్ వలి, పలువురు నాయకులు పాల్గొన్నారు.